క్లుప్తంగా

జ్వాలాతోరణ మహోత్సవం నేడు

సీతంపేట: కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆదివారం రాత్రి 7 గంటలకు దేవదాయ శాఖ పరిధిలోని శివాలయాల్లో జ్వాలాతోరణ మహోత్సవం నిర్వహించనున్నట్టు ఈవో రమాభాయి తెలిపారు. సీతంపేట పార్వతీశ్వరాలయం, రామకృష్ణానగర్ రామలింగేశ్వరాలయాల్లో జరిగే మహోత్సవానికి అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమానికి ముందుగా పార్వతీపరమేశ్వరులు, రామలింగేశ్వర స్వామి తిరువీధి పల్లకీ ఊరేగింపు జరుగుతుందన్నారు. భక్తులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందాలని ఈవో కోరారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు చెప్పారు. తెల్లవారు 4 గంటల నుంచే భక్తుల దర్శనానికి అనుమతిస్తున్నట్టు తెలిపారు.

ఘనంగా శని త్రయోదశి పూజలు



పార్వతీశ్వరాలయంలో శనీశ్వరుడికి పూజలు చేస్తున్న భక్తులు

సీతంపేట: కార్తీక మాసం, శని త్రయోదశి సందర్భంగా సీతంపేటలోని పార్వతీశ్వరాలయం భక్తులతో కిటకిటలాడింది. శనివారం తెల్లవారుజామున పెద్ద సంఖ్యలో ఆలయాన్ని దర్శించి శనీశ్వరుడికి తైలాభిషేకం చేశారు. ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా భక్తుల చేత శనీశ్వరుడికి పూజలు చేయించి, దూప, దీప హారతులిచ్చారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్యపై నివేదికకు ఆదేశం

సీతంపేట: తిమ్మాపురంలోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండియర్ చదువుతున్న విద్యార్థి కాళీ సాయిచరణ్ తాను ఉంటున్న వసతి గృహంలో గురువారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఉదంతంపై పోలీసులు తక్షణ నివేదిక అందించాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం ఒక ప్రకటనలో ఆదేశించారు. విద్యార్థి ఒత్తిడితో మరణించాడా, అనారోగ్య కారణాలు ఏమైనా ఉన్నాయా, కళాశాల యాజమాన్యం చదువుపై ఒత్తిడికి గురిచేసిందా, ఉపాధ్యాయుల వేధింపులు ఉన్నాయా, ఇతర కారణాలు ఏమైనా ఉత్పన్నమయ్యాయా తదితర అంశాలను పరిగణలోనికి తీసుకుని పోలీసులు కమిషన్‌కు నివేదిక అందించాలని పేర్కొన్నారు. దాని ఆధారంగా కమిషన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వానికి చట్ట ప్రకారం చర్యలకు సిఫారసు చేస్తామని సీతారాం తెలిపారు.

మెగా ఫాగింగ్



సీతంపేటలో ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులోని ఐదు సచివాలయాల పరిధిలో శనివారం సాయంత్రం దోమల నిర్మూలనకు మెగా ఫాగింగ్ నిర్వహించారు. సీతంపేట, బీటీఆర్ కాలనీ, హరిజన వీధి, కనకమ్మవారి వీధి, గణేష్‌నగర్, గొల్లవీధి, పాత చేపల మార్కెట్, రాజేంద్రనగర్, శాంతిపురం, మధురానగర్, గురుద్వారా ప్రాంతాల్లో ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ సిబ్బంది రాంబాబు, శివ పాల్గొన్నారు.

ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణ

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం స్థాపించిన నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(నేక్) ద్వారా ఏపీ రాష్ట్ర నైపుణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ తదితర కోర్సుల్లో శిక్షణ ఇస్తున్నామని నేక్ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్ఎస్ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి చదివి 15 నుంచి 45 ఏళ్లలోపు వయసు కలిగిన యువతీ, యువకులు అర్హులన్నారు. శిక్షణ అనంతరం ప్రైవేటు సెక్టార్‌లో ఉపాధి కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు 7989572891, 8500502395 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ప్రగతి పథం

రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాలుగునర్రేళ్లుగా సుపరిపాలన సాగిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా మహా విశాఖ అభివృద్ధికి అధిక ప్రాధాన్యమిచ్చారు. జీవీఎంసీ పరిధిలోని ప్రతి ప్రాంతంలో ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. నిధుల కేటాయింపులో వెనుకడుగు వేయకుండా అభివృద్ధి పనులు చేయిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి అందని ద్రాక్షలా మిగిలిపోయింది. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ప్రతి ప్రాంతాభివృద్ధి జోరుగా సాగుతోంది.



టీడీపీ హయాంలో అధోగతి

గత టీడీపీ హయాంలో కొండవాలు ప్రాంతాల అభివృద్ధి అటకెక్కింది. సంజీవయ్య కాలనీలో కొండచరియలు విరిగిపడిన సంఘటనలో అనేక మంది ప్రాణాలు కోల్పోయారు. నాటి పాలకులు బాధితులకు నష్టపరిహారం చెల్లించి చేతులు దులిపేసుకున్నారు. కొండవాలులో రక్షణ చర్యలు, మౌలిక వసతుల కల్పన మరిచారు.

వైఎస్సార్‌సీపీ పాలనలో అభివృద్ధి

ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొండవాలులోని ప్రతి సమస్యకు మోక్షం లభించింది. ఈ నాలుగునర్రేళ్లలో వార్డులోని శాంతినగర్, మధుసూదన్ నగర్, కై లాసపురం, సంతోష్‌నగర్, సూరిబాబు నగర్, లక్ష్మీనారాయణపురం, కస్తూరి నగర్-1, 2 కొండవాలు ప్రాంతాలు అభివృద్ధి పథంలో సాగుతున్నాయి.



46వ వార్డు సూరిబాబునగర్‌లో నిర్మించిన డ్రైనేజీ



జీవీఎంసీ 46వ వార్డులో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలు

- రూ.40 లక్షల జీవీఎంసీ నిధులతో మధుసూదన్ నగర్, కస్తూరినగర్, శాంతినగర్, సంజీవయ్య కాలనీ కొండవాలు ప్రాంతాల్లో గెడ్డల రక్షణ గోడలు(సీసీ) నిర్మించారు.
- రూ.40 లక్షలతో మధుసూదన్ నగర్, శాంతినగర్, సూరిబాబునగర్, కస్తూరినగర్-1, 2, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో డ్రైనేజీలు(సీసీ) నిర్మించారు.
- రూ.55 లక్షలతో కస్తూరినగర్, శాంతినగర్, మధుసూదన్ నగర్, సంజీవయ్య కాలనీ, లక్ష్మీనారాయణపురం ప్రాంతాల్లో గెడ్డలను ఆధునికీకరించారు.
- రూ.30 లక్షలతో మధుసూదన్ నగర్, శాంతినగర్, కస్తూరినగర్-1, 2 ప్రాంతాల్లో కాలువలు, డ్రైనేజీలు నిర్మించారు.
- రూ.15 లక్షలతో మధుసూదన్ నగర్, సంతోషనగర్, శాంతినగర్, కస్తూరినగర్ ప్రాంతాల్లో రెయిలింగ్ పనులు చేపట్టారు.
- రూ.35 లక్షలతో సంజీవయ్య కాలనీలో డ్రైనేజీలు, కాలువలు నిర్మించారు.
- రూ.20 లక్షలతో శాంతినగర్‌లో, రూ.20 లక్షలతో లక్ష్మీనారాయణపురంలో, రూ.40 లక్షలతో సంతోషనగర్‌లో గెడ్డ రక్షణ గోడలు నిర్మించారు.
- రూ.15 లక్షలతో కస్తూరినగర్‌లో డ్రైనేజీలు నిర్మించారు.



శాంతినగర్‌లో గెడ్డ వద్ద నిర్మించిన రక్షణ గోడలు

కంచరపాలెం: నియోజకవర్గంలోని జీవీఎంసీ వార్డులు ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయి. ప్రజల సౌకర్యార్థం ముఖ్యమైన పనులకు లక్షల రూపాయల నిధులు కేటాయించి జోరుగా చేపడుతున్నారు. ఏళ్లుగా ఆయా ప్రాంతాల్లో తిష్టవేసిన సమస్యలను పరిష్కరిస్తున్నారు. ప్రజా ప్రతినిధుల చేతుల మీదుగా ప్రతి వార్డులో శంకుస్థాపనలు చేసి.. చకచకా రోడ్లు, డ్రైనేజీలు, కాలువలు, గెడ్డలు, రక్షణ గోడలు వంటివి నిర్మిస్తున్నారు.

ఇది కదా అభివృద్ధి

రూ.5.70 కోట్లతో వార్డు అభివృద్ధి

జీవీఎంసీ 46వ వార్డు కంచరపాలెం, తాటిచెట్లపాలెం, కై లాసపురం పరిధిలోని కొండవాలు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి. సుమారు రూ.5.70 కోట్ల నిధులతో ఈ పనులు చేపడుతున్నారు. ఇప్పటికే రూ.4.50 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయ్యాయి. మరో రూ.1.20 కోట్లతో పనులు నిర్మాణ దశలో ఉన్నాయి.

చురుగ్గా నిర్మాణ పనులు

జీవీఎంసీ మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్, 46వ వార్డు కార్పొరేటర్ కటుమూరి సతీష్‌ల చొరవ, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజవకర్గ సమన్వయకర్త కె.కె.రాజు కృషితో కొండవాలు ప్రాంతాలకు మంచిరోజులొచ్చాయి. డ్రైనేజీలు, కొండవాలుకు రక్షణ గోడలు, కాలువలు, గెడ్డల ఆధునికీకరణ- రక్షణగోడలు, మెట్ల మార్గాలకు రెయిలింగ్ తదితర అభివృద్ధి, నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. వార్డులో సమస్యలు పరిష్కారమై అభివృద్ధికి నోచుకోవడంతో కొండవాలు ప్రాంతాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



మధుసూదన్ నగర్‌లో డ్రైనేజీని పరిశీలిస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

చెప్పినట్టే అభివృద్ధి చేస్తున్నారు



కొండవాలు ప్రాంతంలో ఎన్నో ఏళ్లుగా నివసిస్తున్నాం. మౌలిక వసతులు, అభివృద్ధి జాడ ఏనాడు కనిపించ లేదు. నాలుగేళ్ల కిందట వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని నమ్మి ముఖ్యమంత్రిగా గెలిపించుకున్నాం. ఆయన ఇచ్చిన మాట ప్రకారం కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారు. మా వార్డు కార్పొరేటర్ కటుమూరి సతీష్ కృషితో నిధులు మంజూరై అభివృద్ధి పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

– పి.భవాని, కస్తూరినగర్

ప్రభుత్వ కృషి భేష్



రాష్ట్ర ప్రభుత్వం, జీవీఎంసీ కృషితో కొండవాలు ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కారమవుతున్నాయి. లక్షల రూపాయల నిధులతో వార్డును అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారు. ప్రజలకు అవసరమైన అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. రోడ్లు, డ్రైనేజీలు, కాలువల నిర్మించి కొండవాలు ప్రజల ఇబ్బందులు తొలగిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుంటాం.

– బి.గోవిందరావు, శాంతినగర్

సందడిగా గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



విద్యార్థులు తయారు చేసిన కళాఖండాలను తిలకిస్తున్న కె.కె.రాజు, బాణాల శ్రీనివాస్



వేడుకల్లో పాల్గొన్న గ్రాండ్ పేరెంట్స్

తాటిచెట్లపాలెం: తాటిచెట్లపాలెంలోని కేంద్రీయ విద్యాలయ, వాల్తేర్‌లో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు మాట్లాడుతూ పిల్లలు తమ గ్రాండ్ పేరెంట్స్ వద్ద పెరగడం ద్వారా క్రమశిక్షణ, విలువలు నేర్చుకుంటారన్నారు. వారిని గౌరవించాలన్నారు. ప్రైమరీ స్కూల్ విద్యార్థులు, సంగీతం అధ్యాపకుడు డాక్టర్ త్యాగరాజ్ నేతృత్వంలో వెల్‌కం డ్యాన్స్, గ్రూప్ సాంగ్, గుజరాతీ డ్యాన్స్ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్కూల్ విద్యార్థులు తయారు చేసిన పలు వస్తువులను ప్రదర్శించారు. వీటిని అతిథులు, గ్రాండ్ పేరెంట్స్ తిలకించి పిల్లలను అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో విజేతలకు కేవీ ప్రిన్సిపాల్ కమల్‌జీత్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం కె.కె.రాజును స్కూల్ సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వి.ఎం.శైలజ, శోభాగీత, వాణి, రేఖ మిట్టపల్లి, వై.విజయలక్ష్మి, ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్, 44వ వార్డు కార్పొరేటర్ బాణాల శ్రీనివాసరావు, బొడ్డేటి గంగామహేష్, హబీబ్, రాజకుమారి, గోపి, సీతారాములు, బషీర్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న కిడ్స్ ఫ్యాషన్ షో



ఆడిషన్స్‌లో పాల్గొన్న చిన్నారులు

సీతంపేట: వీజేఆర్ ఎంటర్‌ప్రైజెస్ ఆధ్వర్యంలో ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన విశాఖ కిడ్స్ ఫ్యాషన్, టాలెంట్ షో ఆడిషన్స్ ఆహుతులను విశేషంగా ఆకట్టుకుంది. 2 నుంచి 14 ఏళ్లలోపు 120 మంది చిన్నారులు ఆకర్షణీయమైన వస్త్రాలు ధరించి ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని తమ ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా వీజేఆర్ సంస్థ అధినేత, గ్లోబల్ మిసెస్ ఆంధ్రప్రదేశ్ ఇండియా ఇంటర్నేషనల్ 2023, క్వీన్ ఆఫ్ ఇండియా విన్నర్ కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో కూడా ఆడిషన్లు నిర్వహిస్తున్నామని, ఈ నెల 28 వరకు జరుగుతాయని తెలిపారు. విజేతలకు వచ్చే ఏడాది జనవరిలో ఫైనల్స్ నిర్వహిస్తామన్నారు. తన కుమారుడు రంజీవ్ స్మారకార్థం పిల్లల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. బ్రెడ్స్ ఇండియా రన్నర్ దివ్యా మచ్చ న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో డ్రీమ్ లైఫ్ స్టూడియో సీఈవో వినయ్ చౌదరి పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప అంబలం పూజ



అంబలం పూజలో పాల్గొన్న స్వాములు

మద్రిపాలెం: మాధవధార తెన్నేటినగర్‌లో శనివారం వెంకటేష్ గురుస్వామి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి అంబలం పూజా మహోత్సవం వైభవంగా జరిగింది. రమణ గురుస్వామి 18వ మండల దీక్ష పురస్కరించుకుని అంబలం పూజలు నిర్వహించారు. రమణ గురుస్వామి ఆధ్వర్యంలో రంగురంగుల విద్యుద్దీపాలు, పుష్పాలు, అరటిచెట్లతో అయ్యప్ప మండపాన్ని అలంకరించారు. అర్చకుడు రాపాక వెంకట రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో అయ్యప్పస్వామికి ప్రత్యేక పూజలు, పడిపూజ, పల్లకీ సేవ, 18 కలశాలతో పదునెట్టంబడి పూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూలాలంకరణ చేశారు. భక్తిరంజని ఆధ్వర్యంలో అయ్యప్ప భజన గీతాలాపన, సంకీర్తన కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మాలధారులకు కైంకర్యం ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే సురక్షిత ప్రయాణం

సీతమ్మధార: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, ఉదయం 7 గంటల నుంచి భారీ వాహనాలకు అనుమతి ఇవ్వకూడదని ఏఐఎస్‌ఎఫ్ విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.నాగరాజు, ఎస్.శ్రీను అన్నారు. ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో శనివారం ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రాణాలు కాపాడుకోవాలి, వేగం వద్దు ప్రాణం ముద్దు అని నినాదాలు చేస్తూ రామాటాకీస్ కూడలి నుంచి జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీవన్, కిరణశేఖర్, బన్ను, విద్యార్థులు పాల్గొన్నారు.

27, 28 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మురళీనగర్: ఏపీఈపీడీసీఎల్ జోన్-2 పరిధి కప్పరాడ, ఇందిరానగర్ 11 కేవీ ఫీడర్లలో ఏఎల్59 జీబ్రా కండక్టర్ మార్పిడి పనుల కారణంగా ఈ నెల 27, 28 తేదీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అప్పర్ జయప్రకాష్‌నగర్, జయప్రకాష్‌నగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, సురేష్‌రామ్‌నగర్, జగ్జీవన్ నగర్ ప్రాంతాల్లో సోమ, మంగళవారాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఆర్జిత సుప్రభాత సేవ శనివారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున భక్తులు ఆలయ ప్రదక్షిణ చేశారు. సన్నిధిగొల్ల సేవ అనంతరం శ్రీవారి ముఖ్య మండపంలో భక్తుల సమక్షంలో వేదపండితులు సుప్రభాతం చదివి వినిపించారు. శ్రీవారి తొలి నైవేద్యంగా నివేదించిన గోక్షీరం, మీగడ, వెన్న, పళ్లు ప్రసాదంగా భక్తులకు అందజేశారు. మధ్యాహ్నం అన్నదాన సత్రంలో 200 మందికి అన్నదానం చేశారు. సాయంత్రం స్వామికి ప్రత్యేక హారతులు సమర్పించారు. ఆలయ కార్యనిర్వహణ ధికారి బండారు ప్రసాద్ పర్యవేక్షించారు.

కొండవాలులో పెండింగ్ పనులపై వినతి



జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు సమస్యలు వివరిస్తున్న కార్పొరేటర్ కవిత

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం కొండవాలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, పెండింగ్ పనులపై దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మను కార్పొరేటర్ గంకల కవిత కోరారు. ఈమేరకు శనివారం ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. వార్డులో జరుగుతున్న పనులు నిలిచిపోవడంతో అభివృద్ధి కుంటిపడుతోందని ఆమె అన్నారు. వార్డులో పర్యటించాలని కమిషనర్‌ను కోరారు.

సాహితీ సమోద్ధరణకు విశాలాంధ్ర విశేష కృషి

మహారాణిపేట: విశాలాంధ్ర సంస్థ 50వ దశకం నుంచి సాహిత్యం ద్వారా సమాజంలో చైతన్యం పెంపొందించేందుకు విశేష కృషి చేస్తోందని ది విశాఖపట్నం కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు అన్నారు. విశాలాంధ్ర 22వ పుస్తక మహోత్సవాన్ని స్థానిక టర్నర్ సత్రంలో శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సాహిత్యంలో నూతన ఒరవడి తీసుకురావడంలో విశాలాంధ్ర ఎంతో కృషి చేసిందని పేర్కొన్నారు. సభకు అధ్యక్షత వహించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విశాఖ బుక్ ఫెస్టివల్ పేరుతో నగరంలో ప్రదర్శన నిర్వహించాలని ప్రయత్నాలు చేసినప్పటికీ కొన్ని అనివార్య కారణాల వల్ల అది సాధ్యం కాలేదని, ఆ లోటును భర్తీ చేయడంలో విశాలాంధ్ర ప్రదర్శన ముందు వరుసలో నిల్చుందన్నారు. విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్ మేనేజర్ టి. మనోహర్‌నాయుడు, రచయిత ఆచార్య సూర్యారావు, ఆచార్య సిమ్మన్న, హిమాన్సు బుక్ డిపో ప్రసాద్, అరసం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల అప్పలరాజు, బుక్ హౌస్ మేనేజర్ పి.ఎ. రాజు తదితరులు పాల్గొన్నారు.

చదరంగం రోలింగ్ ట్రోఫీ టోర్నీ ప్రారంభం



రోలింగ్ ట్రోఫీని ఆవిష్కరిస్తున్న కె.కె.రాజు

మద్రిపాలెం: ఎంగ్రవ్ చెస్ అకాడమీ, శ్రీ చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో డాక్టర్ రొంగల బాబూరావు ఫస్ట్ స్టేట్ ఓపెన్ చెస్ రోలింగ్ ట్రోఫీ టోర్నీ ప్రారంభమైంది. 51వ వార్డు మాధవధార మాధవ స్వామి కల్యాణ మండపంలో శనివారం ఈ టోర్నమెంట్‌ను ముఖ్య అతిథి నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ప్రారంభించి, రోలింగ్ ట్రోఫీ ఆవిష్కరించారు. ఈ పోటీలు ఆదివారం నుంచి జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో 51వ వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ, కో-ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, చెస్ అకాడమీ సభ్యులు కె.వి.వి.శర్మ, జ్వాలాముఖి, సురేష్, ఆర్.బాబూరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మెట్ల మార్గాల నిర్మాణానికి భూమిపూజ



కస్తూరినగర్-2లో భూమిపూజ చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కస్తూరినగర్-2లో మెట్ల మార్గాల పునర్నిర్మాణానికి శనివారం డిప్యూటీ మేయర్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కటుమూరి సతీష్ భూమిపూజ చేశారు. అనంతరం అభివృద్ధి పనుల శిలాఫలాకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ కొండవాలు ప్రాంతాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్దపీట వేశారన్నారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్లకు సూచించారు. పనులను జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. రూ.18.80 లక్షల నిధులతో మెట్ల మార్గాలను పునర్నిర్మిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కో-ఆప్షన్ సభ్యుడు ఎస్.అప్పారావు, డీఈ భరణి, ఏఈ ఉమామహేశ్వరరావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ జాగారాపు నరేష్, సీవో వరలక్ష్మి, వార్డు నాయకులు కె.చిన్నా, రామారావు, కృష్ణ, నర్సింగరావు, లావణ్య, కృపా, ఈశ్వరరావు, శ్రీను, అప్పలరెడ్డి, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

ఇసుకకొండకు కార్తీక శోభ

దాబాగార్డెన్స్: ఇసుకకొండ(బాబాజీకొండ)పై వెలసిన శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయం.. కార్తీక శోభను సంతరించుకుంది. ఇక్కడ ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం ఉదయం వరకు పౌర్ణమి పూజలు జరగనున్నాయి. భక్తుల కోసం దేవస్థానం తగు ఏర్పాట్లు చేసింది.